# ఇశ్రాయేలు

బైబిల్లో ఇశ్రాయేలు అనే పేరును వేర్వేరు అర్థాల్లో వుపయోగించారు. అయితే, యివన్నీ ఒక దానితో ఒకటి సంబంధం కలిగి వున్నవే. ఈ క్రింద వున్న సారాంశం ఈ పేరును వివిధ రకాలుగా ఎలా వాడాలో వివరిస్తుంది.

వ్యక్తి నామం: హెబ్రీ భాషలో ఇశ్రాయేలు అనే పేరుకు అంటే దేవునితో పోరాడువారు అని అర్థం (దేవుడు నాతో కలిసి పోరాడును అనే అర్థం కూడ ఈ పేరుకు వుంది). దేవుని శత్రువులను ఆయన ప్రజల శత్రువులను దేవుడు ఓడిస్తాడనే భావం రెండవ అర్థంలో స్ఫురిస్తుంది. అబ్రాహాం శారాల మనుమడు. ఇస్సాకు రిబ్కాల కుమారుడు అయిన యాకోబు దేవునితో పోరాడిన తర్వాత అతనికి ఇశ్రాయేలు అనే పేరు వచ్చింది (ఆది 32:22-32). తర్వాత, యాకోబు (ఇశ్రాయేలు) పంన్రెండుగురు కుమారుల పేర్లు ఇశ్రాయేలు పంన్రెండు గోత్ర నామాలు అయ్యాయి (ఆది 48:49).

ఇశ్రాయేలు ప్రజలు: యాకోబు అనంతరం చాలా కాలం తర్వాత ఇశ్రాయేలు గోత్రాలకు చెందిన ప్రజలను ఇశ్రాయేలీయులు అని పిలిచారు. ఇది ఎప్పుడు ప్రారంభమైందో ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఇశ్రాయేలీయులు అనే ప్రజలున్నారనే తొలి చారిత్రక ఆధారం క్రీ.పూ. 1230 నాటికి చెందిన మెర్నెస్టా అనే శిలాఫలకం. ఈ శిలాఫలకంలో ఇశ్రాయేలు అనే పేరు ఒక పరదేశి ప్రజ పేరుగా కన్పిస్తుంది. అప్పటికి దేవుని ప్రజ అయిన యాకోబు వంశీయులు మోషే నేతృత్వంలో ఐగుప్తు నుంచి బయటకి వచ్చి వాగ్దాపదేశమైన కనానుదేశం చేరుకున్నారు. ఇశ్రాయేలు పంన్రెండు గోత్రాల ప్రజలు కనానులో స్థిరపడుతున్న కాలంలో (అప్పటి వీరికింకా ఇశ్రాయేలు రాజ్యమనే పేరు లేదు). వారింకా అసంఘటితంగానే వున్నారు (న్యాయాధిపతులు ఐదవ అధ్యాయం).

ఇశ్రాయేలు దేశం: క్రీ.పూ.1000 లో ఇశ్రాయేలు గోత్రాలన్నీ మొదటి రాజైన స ాలు అధ్వర్యంలో సంఘటితమయ్యాయి (1సమూ 9,10). అయితే, ఈ గోత్రాలన్నిటిన ఏకం చేసి వారినొక రాజ్యంగా చేసిన ఘనత దావీదుదే (2 సమూ 5:1-5). ఇశ్రాయేలు ముఖ్య పట్టణం యెరూషలేం. యిది వీరి మతానికి ఆరాధనకు కేంద్రం కూడ. దావీదు కుమారుడైన సొలొమోను యెహోవాను ఆరాధించడానికి యెరూషలేం లో దేవాలయాన్ని నిర్మించాడు. (2సమూ 7:1 రాజులు 6:8:2). సొలొమోను రాజు పరిపాలనలో ఇశ్రాయేలు రాజ్యం అఖాబా సింధుశాఖ నుంచి ఐగుప్తు ఉత్తర సరిహద్దు మీదుగా కాదేను వరకు, ఉత్తర సిరియాలోని యూఫ్రటీసు నది వరకు విస్తరించింది.

సొలొమోను మరణానంతరం (క్రీ.పూ924) పది ఉత్తర గోత్రాలు వేరై పోయాయి. యిక మిగిలినవి దక్షిణాన వున్న రెండు గోత్రాలు (యిదే యూదా రాజ్యం). ఉత్తర గోత్రాల ముఖ్య పట్టణం షోమ్రోను. వీరే 'ఇశ్రాయేలు' రాజ్యం (2నమూ 19:41:1 రాజులు 12). క్రీ.పూ 722 ఉత్తరం వైపునుంచి వచ్చిన అష్టూరువారు ఇశ్రాయేలుపై దండెత్తి, ప్రజల్లో అనేకులను అష్టూరు రాజ్యం నలుమూలలకు తీసుకొనిపోయారు.

అష్టూరువారు దక్షిణ రాజ్యమైన యూదాపై దండెత్తలేదు. అయితే, క్రీ.పూ. 586లో బబులోనువారు యూదాను ఓడించి అనేకులను బబులోను దేశానికి చెరగొని పోయారు. ఇశ్రాయేలు చరిత్రలో ఈ కాలాన్నే 'చెరకాలం' అని పిలుస్తారు. మరిన్ని వివరాలకు చెర (ప్రవాసం) అన్న చిన్న వ్యాసం చూడండి. చెర కాలంలోనూ, చెర అనంతరం దేవుని ప్రజలను ప్రవక్తలు ఇశ్రాయేలు అనే పేరుతో పిలిచారు (యెషయా 43: యెహెజ్కేలు 36: హోషేయ 4,5).

దేవుని పవిత్ర ప్రజ: బబులోను చెర అనంతరం యూదాకు తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులను కొంతకాలం పారసీకులు, అనంతరం గ్రీకులు పరిపాలించారు. ఈ కాలంలో ఇశ్రాయేలీయులకు వారు నివసించే ప్రదేశాలతో నిమిత్తం లేకుండా 'యూదులు' అని పిలిచారు. ఈ పేరు గ్రేకో-లాటిన్ పదమైన యూదయ నుంచి వచ్చింది. యూదులు వేర్వేరు ప్రదేశాల్లో నివసించారు గనుక వారు తమ ఉనికిని ఏదో ఒక భౌగోళిక ప్రదేశానికో లేకతమను నియంత్రించిన రాజకీయ అధికారానికో పరిమితం చేసుకోలేదు. వీరి ఉనికి దేవుని ధర్మశాస్త్రానికి లోబడటంలోనే వుంది. దేవునికి లోబడటంలో వీరు చూపించిన అమిత శ్రద్ధాసక్తులు వీరిన యితరులనుంచి ప్రత్యేకించాయి. యేసు కాలంలో ఇశ్రాయేలీయులను రోమన్లు పరిపాలించినప్పటికీ, వారు మాత్రం తమను పవిత్ర ప్రజగా ప్రత్యేకించిన ఆచారసాంప్రదాయాలను మతాచారాలను పండగలను ఆచరించారు.